పాతనగరంలో వాహనాలు, పాదచారుల తాకిడి ఎక్కువగా ఉండే నూనె మిల్లు వీధి, పాత బస్టాండ్ రోడ్లు శిథిలమై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పెద్దపెద్ద గోతులు ఏర్పడి వాహన చోదకులు ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. నూనెమిల్లు వీధిలో అయితే దుకాణాల్లో పని చేసే కళాసీలు సరకులు దించే సమయంలో రోడ్డు శిథిలమై పైకి తేలిన రాళ్లు గుచ్చుకుని సరకులతో పాటు పడి గాయాల పాలవుతున్నారు.


గోతులమయంగా పాత బస్టాండ్ రోడ్డు

ప్లీజ్.. ▸ రోడ్డేయరూ..!

- నూనెమిల్లు వీధి ప్రజల అభ్యర్థన
- రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందులు
- పాత బస్టాండ్ రోడ్డుదీ అదే దుస్థితి


రాళ్లు తేలిన నూనెమిల్లు వీధి రోడ్డు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో నూనెమిల్లువీధి, పాత బస్టాండ్ రోడ్లు శిథిలమై రాకపోకలకు పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లు కొన్నాళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో గతుకులుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నా రు. ఇటీవల జీవీఎంసీ ఈ వార్డులో ఉన్న రామకృష్ణా రైతుబజార్, జనతాబజార్, బౌడారారోడ్డు ఏరియాల్లో బీటీ రోడ్లు వేసింది. నూనెమిల్లు వీధిని మా త్రం అధికారులు, నాయకులు విస్మరించడంతో అది ఎలాంటి మరమ్మతులకు నోచుకోక అలాగే ఉండిపోయింది. నిజానికి నూనెమిల్లు వీధి ఎక్కువ జనసమర్థం, వాహనాల తాకిడి ఉండే వీధి. శిథిలమైన ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలి. ఇక్కడ హోల్‌సేల్ కిరాణా వ్యాపారాలు అనేకం ఉన్నాయి. ఈ దుకాణాలకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి విచ్చేస్తూ ఉంటారు. అయితే ఈ వీధి ఎప్పట్లాగే శిథిలావస్థలోనే ఉండిపోవడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇక్కడి యూజీడీలు కూడా..

నూనెమిల్లు వీధి శిథిలమై స్థానికులు, వాహన చోదకులు బాధలు పడుతుంటే ఇక్కడున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉంది. ఈ దారిలో నిత్యం ప్రయాణించే వాహనాల వల్ల యూజీడీ మ్యాన్‌హోల్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దాంతో మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోంది.



రాళ్లు తన్నుకుని పడిపోతున్నాం..

నూనెమిల్లు వీధిలో రహదారి సక్రమంగా లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. వాహనాలు వచ్చినప్పుడు కళాసీలందరం సరకులు దించి దుకాణాల వద్దకు తీసుకెళ్లే సమయంలో శిథిలమైన రోడ్డు మీదున్న రాళ్లు తన్నుకుని పడిపోతున్నాం. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.
– సత్యరాజు, కళాసీ, నూనెమిల్లువీధి, జీవీఎంసీ 35వ వార్డు

మరింత దారుణంగా పాత బస్టాండ్ రోడ్డు..

వార్డులో ఉన్న పాత బస్టాండ్ రోడ్డు మరింత దారుణంగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏవీఎన్ కళాశాల నుంచి పాత బస్టాండ్ మీదుగా.. డాల్ఫిన్ రోడ్డు నుంచి టౌన్‌లోకి వెళ్లే మార్గం శిథిలమైంది. పాత బస్టాండ్ ఫ్రూట్ మార్కెట్ దరి రోడ్డు గోతులు పడి వాహనాల ప్రయాణానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. మార్గమధ్యలో కేబుల్ వైర్ల నిమిత్తం తవ్వి వదిలేసిన గొయ్యి ఇప్పుడు కాలువగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు. ఈ ప్రాంతంలోనే ఆదివారం చేపల మార్కెట్ నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో మరిన్ని ఇబ్బందులు తప్పటం లేదని వ్యాపారులు, వినియోగదారులు వాపోతున్నారు.

అలాగే ఇక్కడున్న ఓ కల్వర్టు కూడా శిథిలమై వాహనాల రాకపోకలకు అంతరాయంఏర్పడుతోంది. దీని వల్ల తమ వ్యాపారాలు సజావుగా సాగటం లేదని వ్యాపారులు వాపోతున్నారు.



రోడ్డు వేస్తే సమస్యలు తీరుతాయి..

పాత బస్టాండ్ రోడ్డు నిర్మిస్తే ఏవీఎన్ కళాశాల, ఫ్రూట్ మార్కెట్, చేపల మార్కెట్‌కు వచ్చే వాహన చోదకులకు అనుకూలంగా ఉంటుంది. గతంలో వేశారు కానీ వెంటనే పోయింది. ఈసారి నాణ్యంగా రోడ్డు వేయాలి. అప్పుడు పాదచారులు, వాహన చోదకుల ఇబ్బందులు తీరుతాయి. –మహేష్, వ్యాపారి, జీవీఎంసీ 35వ వార్డు



త్వరలో రోడ్డు నిర్మిస్తాం..

ఇటీవలే నూనెమిల్లు వీధి రోడ్డుకి శంకుస్థాపన చేశాం. వీలైనంత త్వరగా కాంట్రాక్టర్లతో రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తాం. అందులోనే యూజీడీ పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదేశించాం. అలాగే పాత బస్టాండ్ రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపడతాం. –ఎం. మల్లయ్యనాయుడు, జెడ్సీ, జోన్–4, సూర్యాబాగ్

సిరులతల్లికి పంచామృతాభిషేకం


అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు


పంచామృతాభిషేకంలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముందుగానే మార్గశిర మాసం..

కనకమహాలక్ష్మి మార్గశిర మాసం ముందుగానే వచ్చినట్టుంది. గురువారం అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపారు. వచ్చే నెల 2 నుంచి 30 వరకు మార్గశిర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. చాలా మంది భక్తులు మార్గశిర ఉత్సవాల్లో అమ్మవారి దర్శనం దొరుకుతుందో లేదో అనే ఆవేదనతో ముందుగానే ఈ గురువారం అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకోవడంతో క్యూలైన్లన్నీ బారులు తీరాయి.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: నగరంలోని 11 కేవీ విద్యుత్ హెచ్‌టీ లైన్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొబ్బరితోట, జెండా చెట్టు, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, అల్లిపురం, నేరేళ్లకోనేరు, కర్లాలవీధి, అల్లిపురం రైల్వేస్టేషన్ రోడ్డు, అల్లిపురం సిగ్నల్ పాయింట్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని సత్యం జంక్షన్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం, సత్యం జంక్షన్, సునీత నర్సింగ్ హోం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

రెండు రోజులు ధ్యానంపై ప్రవచనాలు


సమావేశంలో మాట్లాడుతున్న భారతి

సీతమ్మధార: ధ్యానంపై అరుణాజీ ప్రవచనాలు ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నవంబర్ 30, డిసెంబర్ 1న జరుగుతాయని ఫౌండేషన్ కోశాధికారి కె. భారతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిష్కామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ధ్యానం నిర్విషయ నమః 'అనే అంశంపై లెక్చర్ సిరీస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అరుణాజీ ధ్యానం విశిష్టత గురించి తెలియజేస్తారని పేర్కొన్నారు. ఫౌండేషన్ వైస్ చైర్‌పర్సన్ ఎస్. శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నసమారాధన

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన శ్రీ రేణుక యల్లమ్మ ఆలయంలో గురువారం అన్నసమారాధన చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా అమ్మవారికి ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బి.పోలారావు, కమిటీ ప్రతినిధులు వాసుపల్లి నారాయణ, నాగరాజు తదితరులు పూజలు చేశారు. అనంతరం సుమారు 500 మందికి అన్నసమారాధన చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం భక్తుల సహకారంతో అన్నసమారాధన చేపడుతున్నామన్నారు.

వృద్ధుడి మృతదేహానికి రెడ్‌క్రాస్ అంత్యక్రియలు


అప్పారావుకు నివాళి అర్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

మహారాణిపేట: అనకాపల్లి వేల్పుల వీధికి చెందిన వాసది అప్పారావు (70) భార్య చనిపోవడంతో మధురవాడ సమీపంలోని బక్కన్నపాలెంలోని కుమార్తె ఇంటికి వచ్చాడు. అయితే అల్లుడు, కుమార్తె పట్టించుకోకపోవడంతో భిక్షాటన చేస్తూ బతకసాగాడు. ఈ క్రమంలో ఆగస్టు 30న అతన్ని పట్టా ఫౌండేషన్ సభ్యులు గుర్తించి రెడ్‌క్రాస్ హోంలెస్ షెల్టర్‌కు తరలించారు. కానీ అతను గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయాన్ని ఎంవీపీ పోలీసు స్టేషన్ సీఐ జె.మురళికి సమాచారం అందించడంతో కానిస్టేబుల్ రాజుల నాయుడు సాయంతో అప్పారావు కుటుంబ సభ్యుల సమక్షంలోనే జ్ఞానాపురం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించామని పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హోం లెస్ షెల్టర్ నిర్వాహకులు తెలిపారు.

జబ్బర్‌తోటలో సహాయక చర్యలు

పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో


జబ్బర్‌తోటలో ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

దాబాగార్డెన్స్: అతిసార సోకి పలువురు మంచం పట్టిన జీవీఎంసీ 37వ వార్డు జబ్బర్‌తోటలో ముమ్మర సహాయక చర్యలు చేపట్టారు. 'జబ్బర్‌తోటకు సుస్తీ' పేరిట గురువారం 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు స్పందిస్తూ.. పైపుల లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమై 16 డయేరియా కేసులు నమోదయ్యాయని, వీరిలో ఏడుగురికి జబ్బర్‌తోట పట్టణ ఆరోగ్య కేంద్రం వద్దే చికిత్స అందించామని, కేజీహెచ్‌లో నలుగురు, ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రిలో ఒకరు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నలుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. జీవీఎంసీ కమిషనర్‌తో చర్చించి పైపుల మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఆ ప్రాంతానికి రెండు రోజుల పాటు ట్యాంకుల ద్వారా మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. 24 గంటలు వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు, మందులు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. అంతే కాక నీటి ద్వారా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించామన్నారు. పరిస్థితి ప్రస్తుతం అదుపులోనే ఉందని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నీటి శాంపిల్స్‌ను లేబరేటరీకి పంపపినట్లు తెలిపారు.

ఇప్పటి వరకు 39 కేసులు..

ఇప్పటి వరకు (గురువారం వరకు) 39 కేసులు గుర్తించామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు తెలిపారు. 32 మందికి ఇంటి వద్దే చికిత్స అందిస్తున్నామని, మిగిలిన ఏడుగురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. జిల్లా రాపిడ్ రెస్పాన్స్ టీంకి సంబంధించి ఆంధ్రా మెడికల్ కాలేజ్ ఫ్యాకల్టీ, డిస్ట్రిక్ట్ రాపిడ్ రెస్పాన్స్ టీం, పీడియాట్రిక్స్ మైక్రోబయాలజీ కమ్యూనిటీ మెడిసిన్‌కు చెందిన వివిధ రకాల నిపుణులు పాల్గొన్నారని తెలిపారు. డయేరియా కేసులు ప్రబలడానికి కారణం కోసం జబ్బర్‌తోట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు.

డీఎంహెచ్‌వోను కడిగి పారేసిన మహిళ..


డీఎంహెచ్‌వో వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళ

జీవీఎంసీ 37వ వార్డు జబ్బర్‌తోటలో నాలుగు రోజులుగా డయేరియా విజృంభించిన నేపథ్యంలో వైద్య శిబిరాన్ని సందర్శించి అతిసార కేసుల విషయమై అక్కడి వైద్య సిబ్బందిని అడిగేందుకు వచ్చిన డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావును ఓ మహిళ తన ఆవేదన వ్యక్తం చేస్తూ కడిగి పారేసింది. ఎంతో కాలంగా మంచినీరు కలుషితమై స్థానికులు వాంతులు, విరేచనలతో ఇబ్బందులు పడుతుంటే ఏ ఒక్క నాయకుడు, ప్రజా ప్రతినిధి పట్టించుకోలేదని.. ఇప్పుడు కేసులు తీవ్రం కావడంతో వస్తున్నారని దుయ్యబట్టింది. ముందుగా చర్యలు చేపడితే బాగుండేది కదా.. అంటూ ఆవేదన వ్యక్తం చేసింది.


బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయం


బాల్య వివాహాలపై మహిళల అవగాహన ర్యాలీ

జగదాంబ: బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని రూపొందించడానికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని ఎక్సెస్ టూ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ఆఫ్ హోల్డ్ ఎన్‌జీవో జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డేవిడ్‌రాజు అన్నారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన బాల్య వివాహ ముక్త్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అయిదు వందల మందితో కలిసి జగదాంబ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారం, నేరమని అన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చర్చి సమీపంలో వైన్‌షాపు

స్థానికుల ఆందోళనతో మూతపడిన వైనం


మూతపడిన వైన్‌షాప్

విశాఖ సిటీ: పూర్ణామార్కెట్ ప్రాంతంలో చర్చికి సమీపంలోనే వైన్ షాప్ ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. స్థానికుల ఆందోళనతో ఎక్సైజ్ అధికారులు లైసెన్సు ఇవ్వకపోవడంతో పాటు స్టాకు విడుదలను కూడా నిలిపివేశారు. బౌడారా రోడ్డు పూర్ణా కాంప్లెక్స్ ఎదురుగా పండా వీధిలో వైన్ షాపును ఏర్పాటు చేశారు. దీనికి 70 మీటర్ల దూరంలోనే చర్చి ఉంది. ఈ వైన్‌షాపును క్రైస్తవ ప్రార్థన మందిరానికి అతి సమీపంలో ఏర్పాటు చేయడంతో స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో ఎక్సైజ్ అధికారులు కూడా ఈ షాప్‌కు ప్రొవిజన్ లైసెన్స్ మంజూరు చేయలేదు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఈ షాపు నిర్వహిస్తూ వచ్చారు. తాజాగా ఈ షాప్‌కు స్టాకు విడుదలను నిలిపివేశారు. దీంతో నిర్వాహకులు షాప్ మూసేసి హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో రైవాడ మంచి నీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే మంచినీటి సరఫరా జరిగే ప్రధాన 800 పీఎస్‌సీ పైపులైన్ బిర్లా జంక్షన్ కూడలి వద్ద లీకైనందున లీకేజీ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా జోన్–3, జోన్–5, జోన్–8లో శుక్రవారం (ఈ నెల 29) ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీరు కేవీఎన్ రవి ఒక ప్రకటనలో తెలిపారు.

జోన్–3 పరిధిలో..

జోన్–3 పరిధి డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, చైతన్య నగర్, కనకమ్మ టెంపుల్ ఏరియా, కెప్టెన్ లైన్స్, గాంధీనగర్ ఏరియా, శారదా స్కూల్ లైన్, ఓల్డ్ కోపరేటివ్ బ్యాంక్ లైన్, క్రాంతినగర్, ఎన్‌హెచ్–16 రోడ్డు ఏరియా, రామకృష్ణానగర్, 80 ఫీట్ రోడ్డు ఏరియా, ఎన్‌జీజీవోస్ కాలనీ, చిన్నూరు, మంగళవీధి, లలితానగర్ తదితర ప్రాంతాలు.

జోన్–5 పరిధిలో..

జోన్–5 పరిధి మర్రిపాలెం, జ్యోతినగర్, మహరాణి వీధి, బాపూజీనగర్, మాధవధార వుడా లేఅవుట్, మాధవధార, కళింగనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, సూర్యనగర్, సిద్ధార్థనగర్, తుమ్మడిపాలెం, సుభాష్‌నగర్, భవానీగార్డెన్స్, కస్తూరి నగర్–1, శాంతినగర్–1,2, సంజీవయ్య నగర్ హిల్ ఏరియా, బాపూజీనగర్–1,2, అంబేడ్కర్ ఎస్టేట్, సురేష్‌రామ్‌నగర్, పెద్ద కొత్తూరు హిల్ ఏరియా, డౌన్ ఏరియా, రాంజీ ఎస్టేట్ డౌన్ ఏరియా, తిక్కవానిపాలెం, జయప్రకాష్‌నగర్, కప్పరాడ–1,2, ఇందిరానగర్–4,5, మహాత్మాగాంధీ నగర్, జవహర్‌లాల్ నగర్, ఏఎస్ఆర్ నగర్, శ్రీనివాసనగర్, పోలీస్ క్వార్టర్స్, పలనాటి కాలనీ, గోకుల్ నగర్, గొల్ల కంచరపాలెం, దుర్గానగర్, శ్రీనివాసనగర్, నందగిరి నగర్, చెక్కుడురాయి బిల్డింగ్ ఏరియా, దాడి రామ్మూర్తి కల్యాణమండపం ఏరియా, 24/7 వాటర్ సప్‌లై ఏరియాలు.

జోన్–8 పరిధిలో..

జోన్–8 పరిధి శ్రీరామనగర్, శ్రీనుబాబునగర్, అజంతా పార్క్, టైలర్స్ కాలనీ, వుడా కాలనీ, పవర్ ఆఫీస్ ఎదురుగా, ఆర్ఆర్‌వీ పురం, రజక కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయానికి చింతిస్తూ జీవీఎంసీ కమిషనర్ తరఫున నగర ప్రజలు సహకరించాలని పర్యవేక్షక ఇంజనీరు తెలిపారు. 30న శనివారం యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరించి సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


విద్యార్థుల ఎత్తు, బరువు కొలుస్తున్న ఏఎన్‌ఎంలు తులసి, సత్యవతి

అల్లిపురం: మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్లో గురువారం కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల ఎత్తు, బరువుతో పాటు హెచ్‌బీ శాతం వివరాలు సేకరించారు. పుట్టుకతో లోపాలు, గ్రహణం మొర్రి, వంకర పాదాలు, సంక్రమణ గుండె జబ్బులు, చిన్నతనంలో వచ్చే పౌష్టిక లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి పిల్లల ఆరోగ్య కరదీపిక పుస్తకంలో నమోదు చేశారు. ఏఎన్‌ఎంలు తులసి, సత్యవతి, ఆశ వర్కర్ జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం ఆర్‌వీఎస్ నాగభూషణం పాల్గొన్నారు.

బహుజనుల ఆశాజ్యోతి పూలే


పూలేకు నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

దాబాగార్డెన్స్: బహుజనుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని బీసీ సంఘం నాయకుడు కంట్రెడ్డి రామన్నపాత్రుడు తెలిపారు. పూలే వర్ధంతి నగరంలోని సెయింట్ ఆంథోనీ హైస్కూల్, గ్రీన్ పార్క్ హోటల్ కూడలిలో గల పూలే విగ్రహం వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొని పూలేకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామన్నపాత్రుడు మాట్లాడుతూ బలహీన వర్గాలు, బహుజనుల శ్రేయస్సుకు పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. బోని శివరామకృష్ణ, నడింపల్లి కృష్ణంరాజు, దేవరకొండ మార్కండేయలు, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సకలాభక్తుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ 29వ వార్డు బీసీ నాయకుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే వర్ధంతిలో పలువురు బీసీలు పాల్గొని పూలేకు నివాళులర్పించారు.

నోటీసులు వెనక్కి తీసుకోవాలని నిరసన


జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్ష చేస్తున్న కార్మికులు

సీతమ్మధార: ఎం.జీ.ఎం. సెవెన్ హిల్స్ యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకుని, యథావిధిగా వారిని కొనసాగించాలని జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వై. రాజు డిమాండ్ చేశారు. ఎంజీఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మిక వ్యతిరేక చర్యలను అరికట్టాలని, లేబర్ డిపార్ట్‌మెంట్ పక్షపాత వైఖరి విడనాడాలని, ఆ డిపార్ట్‌మెంట్ నిద్రపోతుందని పేర్కొంటూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో రాజు మాట్లాడుతూ నెల రోజులుగా ఎంజీఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికుల అక్రమ తొలగింపునకు నిరసనగా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. లేబర్ కమిషనర్‌కి సమ్మె నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. డీఎల్‌సీ పక్షపాత వైఖరి అరికట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఇంత వరకు కార్మికుల గోడు పట్టించుకునే నాథుడే లేడన్నారు. లేబర్ కమిషనర్ రెండు సార్లు యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ పెట్టినా సెవెన్ హిల్స్ యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలపై మాట్లాడలేదని ఆరోపించారు. దీనిని బట్టి సెవెన్ హిల్స్ యాజమాన్యం పట్ల లేబర్ కమిషనర్‌కి ఎంత ఆపేక్ష ఉందో అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. దీక్షలో సంఘం నాయకులు కె. చంద్రశేఖర్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగ్‌ల పంపిణీ


జూట్‌బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న వరప్రసాద్

మహారాణిపేట: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖపట్నం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెరికే ఫౌండేషన్ చైర్మన్ పెరికే వరప్రసాద్ రెడ్ క్రాస్ సిబ్బందికి జ్యూట్ ఉత్పత్తులు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ భవనంలో జరిగిన కార్యక్రమంలో జ్యూట్, పేపర్, క్లాత్ బ్యాగులు వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అనంతరం రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్రరెడ్డి వరప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.రవి కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ప్రవలిక, జిల్లా కోఆర్డినేటర్ సంతోష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించాలి

వార్డు కార్యదర్శులకు జీవీఎంసీ కమిషనర్ సూచన


మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్

జగదాంబ: వార్డు కార్యదర్శులు సమన్వయంతో బాధ్యతలు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన జోన్–4 కార్యాలయంలో అభివృద్ధి, ప్రజల సమస్యలపై జోనల్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జోన్ పరిధి 12 వార్డుల్లో ప్రజలకు నిత్యం పరిశుభ్రమైన తాగునీరు. మౌలిక సదుపాయాలు అందించాలన్నారు. గెడ్డలు పొంగకుండా ఎప్పటికప్పుడు పూడికలు తీసి పరిశుభ్రం చేయాలన్నారు. జోన్‌లో ఉన్న 8256 వీధిలైట్లు, 139 సోలార్ లైట్లు శతశాతం వెలగాలని ఆదేశించారు. జీవీఎంసీ ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధికి ఆదాయం సమకూర్చాలన్నారు. ఇందుకు రెవెన్యూ విభాగం అధికారులు ఆస్తి, నీటి పన్ను వసూళ్లు ముమ్మరం చేయాలన్నారు. తాగునీటి పైపులైన్లు కాలువల్లో కలవకుండా చూడాలన్నారు. నివాసదారులు, వ్యాపారులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. జీవీఎంసీ బిల్డింగ్ ప్లాన్లు సులభంగా, త్వరగా మంజూరు చేస్తుందనే నమ్మకం ప్రజల్లో కలిగించేలా పని చేయాలన్నారు. జనవరి 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వస్తుందన్నారు. జోనల్ స్థాయిలో అభివృద్ధిపై నూతన ప్రతిపాదనలు ఇవ్వాలని, అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని నివేదికలు ఇవ్వాలని జెడ్సీ మల్లయ్యనాయుడుకు సంపత్‌కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రెవెన్యూ ఎస్. శ్రీనివాస్, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి రూ.కోటి చెల్లించాలి

మహారాణిపేట: ఠాగూర్ ఫార్మా ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మృతుల కుటుంబ సభ్యులను కేజీహెచ్ మార్చురీ వద్ద ఆయన పరామర్శించారు. ఫార్మా పరిశ్రమల్లో నిత్యం ప్రమాదాల జరిగి కార్మికులు చనిపోతున్నా ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ ప్రమాదాలపై ఉన్నత స్థాయి అధికారుల కమిటీ సిఫార్సులను ఇంతవరకు బహిర్గతం చేయలేదన్నారు. ప్రమాదం జరిగిన ఏ పరిశ్రమ యజమాన్యాన్ని అరెస్టులు, శిక్షించడం చేయలేదన్నారు. దీంతో యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నాయన్నారు. తక్షణమే ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

గంగవరం పోర్టును స్టీల్‌ప్లాంట్‌కు అప్పగించాలి

దాబాగార్డెన్స్: అమెరికాలో న్యాయస్థానంలో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న అదానీ కేంద్ర బీజేపీ అండతో అక్రమంగా, దౌర్జన్యంగా తన వశం చేసుకున్న గంగవరం పోర్టును తక్షణం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి అప్పజెప్పాలని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సీపీఎం కార్యాలయంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు, సీపీఎం విశాఖ జిల్లా కమిటీ సభ్యుడు వి. కృష్ణారావుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బీజేపీతో కుమ్మక్కై బలవంతంగా గంగవరం పోర్టును అదానీ స్వాధీనం చేసుకున్నారని, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఉన్న 10.4 శాతాన్ని కూడా ముడుపులు ఇచ్చి అతి తక్కువ రేటుకు కొనుగోలు చేసిందన్నారు. ఇప్పుడు పోర్టు విస్తరణ పేరిట చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని ఉపయోగించి విశాఖ స్టీల్ ప్లాంట్ భూములు వెయ్యి ఎకరాలు తమ వశం చేసుకోవడానికి ఒత్తిడి చేస్తుందన్నారు. 2019లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం విశాఖలోని కాపులుప్పాడలో 3 వేల కోట్ల విలువ కలిగిన 130 ఎకరాల భూమిని అప్పనంగా డేటా సెంటర్ పేరిట అదానీకి కట్టబెట్టారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆఘమేఘాలపై బీమిలి బీచ్ శాండ్ మైనింగ్‌ను అదానీకి కేటాయించారని, ఈ కేటాయింపులు కూడా అక్రమమైనవిగా భావిస్తున్నామన్నారు. వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.